పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 724 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ మంగళవారం 22.09.2026 పేజీలు : 8 వెల : 4/-

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

# మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్





- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లపై దాడికి వైసీపీ మూకలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా తరువాయి 2లో



## 2028 నాటికి..

# కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

### సీఎం చంద్రబాబు

- కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక
- వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు

## సిమ్ కార్డు ఫ్రాడ్

# మూడేళ్ల జైలు, రూ.50 లక్షల పెనాల్టీ!

- అనుమతి లేకుండా గుర్తింపు పత్రాలను ఉపయోగించి సిమ్ తీసుకుంటే కఠిన శిక్ష
- ఐఎంఈఐలో మార్పులు చేయడం కూడా తీవ్ర నేరమన్న డీఓటీ
- ఛత్తీస్‌గఢ్‌లో 25 సిమ్‌ల అక్రమ యాక్టివేషన్
- పీఓఎస్ ఏజెంట్‌ను శాశ్వతంగా బ్లాక్ చేసిన అధికారులు




సిమ్ కార్డుల దుర్వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇతరుల గుర్తింపు పత్రాలను వారి అనుమతి లేకుండా ఉపయోగించి సిమ్ తీసుకోవడం, తరువాయి 2లో




## శబరిమల బోర్డుపై కేరళ మంత్రి సీరియస్..

# హైకోర్టుకు వెళతానని హెచ్చరిక

- శబరిమలలో ప్రసాదం కొరతపై తీవ్ర వివాదం
- దేవస్వం బోర్డుపై కేరళ మంత్రి మురళీధరన్ ఆగ్రహం
- అవసరమైతే హైకోర్టుకు వెళతానని చురక
- భక్తుల రద్దీ పెరగడంతోనే కొరత ఏర్పడిందన్న బోర్డు
- విచారణ కమిటీ ఏర్పాటుపై సీఎంతో చర్చిస్తానన్న మంత్రి

ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదాల కొరత తీవ్ర వివాదానికి దారితీసింది. భక్తులకు అరవణ పాయసం, అప్పం తగినంతగా అందకపోవడంపై కేరళ దేవాదాయ శాఖ మంత్రి కె. మురళీధరన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం తరువాయి 2లో

## స్పేస్‌లో చైనా జోరు

# 4 రాకెట్లు.. 30 శాటిలైట్లు!

- మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ప్రయోగాలు
- ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన నాలుగు రాకెట్లు
- రెండు రాకెట్లను అభివృద్ధి చేసిన ప్రైవేటు సంస్థలు
- నాలుగు ప్రయోగాల్లో జరగని రాకెట్ దశల రికవరీ

2లో





## యూపీఐ ఛార్జీలు వద్దు..

# కేంద్రానికి మొబైల్ రిటైలర్ల విజ్ఞప్తి

- యూపీఐ చెల్లింపులపై ఛార్జీల నుంచి మినహాయింపు కోరిన రిటైలర్లు
- అతి తక్కువ లాభాలతో వ్యాపారం చేస్తున్నామని ఆవేదన
- 0.4 శాతం ఎండీఆర్ విధిస్తే వ్యాపార మనుగడకే ప్రమాదమని హెచ్చరిక
- ఇప్పటికే స్మార్ట్‌ఫోన్ల ధరలు భారీగా పెరిగాయని వెల్లడి
- ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాసిన మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్

2లో

## మరికొంత కాలం యూపీఐ

# ఉచితంగానే కొనసాగించాలి

- నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్
- ఛార్జీలు విధిస్తే వ్యాపారులు నగదు వైపు వెళ్లే ప్రమాదం
- యూపీఐ నిర్వహణ ఖర్చు కంటే డిజిటల్ ఎకానమీ ప్రయోజనాలే ఎక్కువ
- నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ సూచన




## డ్రోన్ల దాడికి రష్యా ప్రతీకారం..

# జపోరిఝియాపై భీకర దాడులు

- రష్యాపై 1,000కి పైగా డ్రోన్లతో దాడి చేసిన ఉక్రెయిన్
- జపోరిఝియా నగరంపై ప్రతీకార దాడులు ప్రారంభించిన రష్యా
- నివాస భవనాలపై దాడులు జరుగుతున్నాయన్న జెలెన్‌స్కీ
- ఉక్రెయిన్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిందన్న డొనాల్డ్ ట్రంప్
- న్యూయార్క్‌లో ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ అయ్యే అవకాశం



రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్ఠకు చేరాయి. ఆదివారం నాడు రష్యా భూభాగంపై ఉక్రెయిన్ వెయ్యికి పైగా డ్రోన్లతో భారీ దాడికి పాల్పడటంతో, మాస్కో ప్రతీకార చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఉక్రెయిన్‌లోని కీలక నగరమైన జపోరిఝియాను లక్ష్యంగా చేసుకుని రష్యా బలగాలు విరుచుకుపడుతున్నాయి.

తరువాయి 2లో

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం: సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

*** అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు**

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.




**కుప్పం దేశానికే ఆదర్శం**

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగానూ కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## సిమ్ కార్డు ఫ్రాడ్
# మూడేళ్ల జైలు, రూ.50 లక్షల పెనాల్టీ!

సిమ్ కార్డుల దుర్వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇతరుల గుర్తింపు పత్రాలను వారి అనుమతి లేకుండా ఉపయోగించి సిమ్ తీసుకోవడం, టెలికాం గుర్తింపులను దుర్వినియోగం చేయడం, ఐఎంఈఐ నంబర్లలో అక్రమంగా మార్పులు చేయడం తీవ్ర నేరాలుగా పరిగణిస్తామని టెలికమ్యూనికేషన్స్ శాఖ (డీఓటీ) తెలిపింది. ఇలాంటి నేరాలకు మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో వెలుగుచూసిన ఓ మోసం నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసింది. అక్కడ ఓ పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) ఏజెంట్.. ప్రజలకు తెలియకుండా వారి గుర్తింపు పత్రాలతో 25 సిమ్ కార్డులను యాక్టివేట్ చేసినట్లు గుర్తించారు. విషయం బయటపడిన వెంటనే టెలికమ్యూనికేషన్స్ శాఖ, మొబైల్ సేవల సంస్థలతో కలిసి చర్యలు చేపట్టింది. సంబంధిత పీఓఎస్ ఏజెంట్‌ను బ్లాక్ చేసింది. ఇకపై అతడి దుకాణం నుంచి కొత్త మొబైల్ కనెక్షన్లు జారీ చేయకుండా శాశ్వతంగా నిషేధించింది. ఆ 25 మొబైల్ నంబర్లను డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ (డీఐపీ) ద్వారా పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న కనెక్షన్లకు మళ్లీ ధ్రువీకరణ చేపట్టారు. సరైన ధ్రువీకరణ ఇవ్వని సిమ్‌లను డీయాక్టివేట్ చేశారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల్లో టెలికాం వనరుల దుర్వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డీఓటీ ఈ హెచ్చరిక చేసింది. ప్రజల గుర్తింపు పత్రాలను వారి అనుమతి లేకుండా ఉపయోగించి సిమ్ తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

# టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం.. మంత్రి లోకేశ్

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లపై దాడికి వైసీపీ మూకలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## డ్రోన్ల దాడికి రష్యా ప్రతీకారం..
# జపోరిఝియాపై భీకర దాడులు

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్ఠకు చేరాయి. ఆదివారం నాడు రష్యా భూభాగంపై ఉక్రెయిన్ వెయ్యికి పైగా డ్రోన్లతో భారీ దాడికి పాల్పడటంతో, మాస్కో ప్రతీకార చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఉక్రెయిన్‌లోని కీలక నగరమైన జపోరిఝియాను లక్ష్యంగా చేసుకుని రష్యా బలగాలు విరుచుకుపడుతున్నాయి. జపోరిఝియాలోని షాపింగ్ మాల్స్, నివాస సముదాయాలపై రష్యా దాడులు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ దాడుల్లో పలువురు పౌరులు గాయపడినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, ఇది మాస్కో నియంత్రణ కోల్పోయేలా చేసిందని వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు పరస్పర దాడులకు తెగబడుతుండటంతో ప్రస్తుతం కాల్పుల విరమణకు ఉన్న అవకాశాలు క్షీణించాయి. మరోవైపు, ఈవారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ క్రమంలో రష్యాతో ఉద్రిక్తతలను తగ్గించే మార్గాలపై చర్చించేందుకు జెలెన్‌స్కీ, ట్రంప్‌తో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం.

## స్పేస్‌లో చైనా జోరు
# 4 రాకెట్లు.. 30 శాటిలైట్లు!

చైనా అంతరిక్ష రంగంలో దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్లను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది. ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్యూ2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్‌ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదే రోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్‌స్పేస్ గ్రావిటీ 1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్ 12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి సాట్‌నెట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది. నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ 11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. అయితే ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా, జుక్యూ3, లాంగ్ మార్చ్ 10బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.

# మరికొంత కాలం యూపీఐ ఉచితంగానే కొనసాగించాలి

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలను మరికొంత కాలం పాటు ఉచితంగానే కొనసాగించాలని నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ ప్రభుత్వానికి సూచించారు. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న ఇటీవలి నిర్ణయంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ పలు కీలక అంశాలను వెల్లడించారు. యూపీఐ వ్యవస్థ నిర్వహణకు ఏటా సుమారు రూ.20,000 కోట్ల మేర వ్యయమవుతున్న మాట వాస్తవమే అయినప్పటికీ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ద్వారా దేశానికి లభించే ప్రయోజనాలు ఆ ఖర్చు కంటే చాలా ఎక్కువని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థలో నగదు వినియోగం గణనీయంగా తగ్గే వరకు యూపీఐ సేవలను ఉచితంగానే ఉంచడం శ్రేయస్కరమని ఆయన స్పష్టం చేశారు. చిన్న వ్యాపారులు, వర్తకులపై 0.4 శాతం మేర ఛార్జీలు విధిస్తే, వారిలో చాలామంది తిరిగి నగదు లావాదేవీల వైపు మళ్లే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇది డిజిటల్ చెల్లింపుల లక్ష్యానికి విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. యూపీఐ సేవలను ఉచితంగా కొనసాగించడం, అధిక విలువ కలిగిన లావాదేవీలపై ఛార్జీలు విధించడంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో రాజీవ్ కుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# యూపీఐ ఛార్జీలు వద్దు.. కేంద్రానికి మొబైల్ రిటైలర్ల విజ్ఞప్తి

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ఇతర అదనపు ఛార్జీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ (ఏఐఎంఆర్ఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే అత్యల్ప లాభాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, ఈ అదనపు భారం తమ మనుగడను దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐఎంఆర్ఏ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా 1.50 లక్షల మందికి పైగా చిన్న, మధ్య తరహా మొబైల్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్లకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది. తాము కేవలం 0.75% నుంచి 1.5% నికర లాభాలతో వ్యాపారాలు సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై 0.4% ఎండీఆర్ విధిస్తే అది నేరుగా తమ లాభాలను హరిస్తుందని పేర్కొంది. ఉదాహరణకు, నెలకు రూ. 10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు యూపీఐ లావాదేవీలు జరిపే రిటైలర్‌పై ప్రతి నెలా రూ.4,000 నుంచి రూ. 16,000 వరకు అదనపు ఆర్థిక భారం పడుతుందని వివరించింది. విక్రయాలు పడిపోవడం, నిర్వహణ ఖర్చులు పెరగడంతో మొబైల్ రిటైల్ రంగం ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉందని అసోసియేషన్ తెలిపింది. దీనికి తోడు స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని, 2025లో రూ. 10,000కు లభించిన ఎంట్రీలెవల్ స్మార్ట్‌ఫోన్ ధర ప్రస్తుతం రూ. 17,000కు చేరిందని, 2026 డిసెంబర్ నాటికి ఇది రూ. 20,000కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.

## శబరిమల బోర్డుపై కేరళ మంత్రి సీరియస్.. హైకోర్టుకు వెళతానని హెచ్చరిక

ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదాల కొరత తీవ్ర వివాదానికి దారితీసింది. భక్తులకు అరవణ పాయసం, అప్పం తగినంతగా అందకపోవడంపై కేరళ దేవాదాయ శాఖ మంత్రి కె. మురళీధరన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు వైఫల్యం వల్లే ఈ సంక్షోభం తలెత్తిందని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయిస్తానని ఆయన హెచ్చరించారు. ఆదివారం శబరిమలలో ప్రసాదాల కొరత ఏర్పడటంతో పంపిణీపై అధికారులు ఆంక్షలు విధించారు. ఒక్కో భక్తుడికి కేవలం ఒక అరవణ పాయసం టిన్, మూడు అప్పం ప్యాకెట్లు మాత్రమే అందజేశారు. మధ్యాహ్నం 1:30 గంటలకు కౌంటర్లు మూసివేసి, తిరిగి సాయంత్రం 5 గంటలకు ప్రారంభించడంతో భక్తులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఈ పరిణామాలపై దేవస్వం బోర్డు అధికారులు వివరణ ఇచ్చారు. కన్నిమాసం పూజల కోసం గత ఏడాది కంటే 50,000 అదనంగా, మొత్తం 2.6 లక్షల ప్రసాదం టిన్నులను సిద్ధం చేసినట్లు తెలిపారు. అయితే, ఈసారి ఊహించని రీతిలో భక్తుల రద్దీ పెరగడంతో కొరత ఏర్పడిందని వెల్లడించారు. సోమవారం నాటికి నిల్వల కేవలం 14,000 టిన్నులకు పరిమితమయ్యాయని పేర్కొన్నారు. ప్రసాదం తయారీ కేంద్రంలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున ఈ సమస్య తలెత్తిందన్న బోర్డు వాదనను మంత్రి మురళీధరన్ తప్పుపట్టారు. ముందస్తు సమాచారం, సరైన ప్రణాళిక లేకుండా ఇలాంటి కీలక పనులు ఎలా చేపడతారని ఆయన నిలదీశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఒక ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసే విషయంపై ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తో చర్చిస్తానని మంత్రి స్పష్టం చేశారు.

# బంగాళాఖాతంలో రేపటికి వాయుగుండం.. ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది. బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## సంపాదకీయం

### బాధ్యత ఉంది కానీ హక్కులు లేవు

# ఒక ఉపాధ్యాయుడి అంతర్మథనం!

విద్యార్థుల గొడవను ఆపే క్రమంలో బెత్తం వాడి జైలుపాలైన ఒక ఉపాధ్యాయుడి మనోవేదన...

విద్యార్థుల మధ్య జరిగిన గొడవను ఆపేందుకు బెత్తం ఉపయోగించినందుకు రెండు రోజులు పోలీస్ స్టేషన్ వరండాలో గడపాల్సి రావడం, ఆ తర్వాత ₹15,000 పరిహారం కూడా చెల్లించాల్సి వచ్చిన వాయనాడ్ విజయ హయ్యర్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయుడి ఆవేదనతో కూడిన రాత:

**రెండు రోజుల అనుభవం...**

ఇన్నేళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేసినా రాని అవగాహన, ఈ రెండు రోజుల్లో నాకు వచ్చింది. అందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు, రాజకీయ నాయకులకు నా కృతజ్ఞతలు.

నేటి కాలంలో ఉపాధ్యాయుడికి అధికారమూ లేదు, హక్కులూ లేవు; కేవలం బాధ్యత మాత్రమే ఉంది అనే విషయం నాకు అర్థమైంది.

ఇకపై విద్యార్థులు ఒకరినొకరు కొట్టుకున్నా, తప్పుడు దారిలో నడిచినా, చదివినా చదవకపోయినా, పరీక్షల్లో కాపీ కొట్టినా, పాఠశాల ఆస్తిని ధ్వంసం చేసినా, మత్తుపదార్థాలు తీసుకున్నా... ఏం చేసినా కళ్ళు, చెవులు మూసుకుని కేవలం జీతం తీసుకుని ఇంటికి వెళ్తే చాలు అనే పాఠాన్ని ఈ సమాజమే నాకు నేర్పింది.

నేను చేసిన చిన్న శిక్షను ప్రతి ఒక్కరూ గంటకోసారి భూతద్దంలో పెట్టి చూపిస్తూ, అదో భయంకరమైన నేరం అన్నట్లు చిత్రీకరించడాన్ని కూడా చూశాను.

ఇకముందు ఎలాంటి బాధ్యతల ఒత్తిడి లేకుండా, పాఠం చెప్పడం ముగించుకుని ఇంటికి వెళ్లిపోయే ఉపాధ్యాయుడిగా ఉండటమే మంచిదని భావిస్తున్నాను. అందుకే, ఇకపై నేను ఎవరినీ సరిదిద్దడానికి ప్రయత్నించబోనని ఈ సమాజానికి, నా ప్రియమైన విద్యార్థులకు తెలియజేస్తున్నాను. దీనివల్ల నాకు ఒక రకమైన మనశ్శాంతి దొరికింది. శుభం.

**తదుపరి భాగం:** పాఠశాల పిల్లలను తమ సొంత బిడ్డల్లా భావించి, వారిని మంచి మార్గంలో నడిపించాలని చూసిన ఒక నిజాయితీపరుడైన ప్రధానోపాధ్యాయుడిని బలిపశువును చేసిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు మేము (ఉపాధ్యాయులం) క్షమాపణలు చెబుతున్నాము. మిమ్మల్ని మా సొంత పిల్లల్లా చూడటం మేము చేసిన తప్పు; మిమ్మల్ని సరిదిద్దాలని చూడటం ఇంకా పెద్ద తప్పు. క్లాస్‌రూమ్‌లలో అబ్బాయిలు, అమ్మాయిలు కలిసి మద్యం సేవించడం, చెడు సావాసాల వైపు వెళ్లడం సరైనది కాదని చెప్పి, వారిని మార్చడానికి ప్రయత్నించడం పిల్లల హక్కుల ఉల్లంఘన, మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని మేము గ్రహించలేకపోయాము. అందుకు మమ్మల్ని క్షమించండి పిల్లలూ... క్షమించండి.

ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి; మీ ఏడు తరాల మంచి కోసం ఆ దేవుడిని ప్రార్థించండి, ఆ దేవుడే మిమ్మల్ని క్షమించాలి.

**చివరి సందేశం:** ఈ సందేశాన్ని మంచి తల్లిదండ్రులకు చేరేలా చూడండి. కనీసం వారిలోనైనా ధర్మబుద్ధి మిగలాలి. వివేకం లేని ఇలాంటి చట్టాలనే మొదట మార్చాల్సి ఉంది.

ఈ పోస్ట్‌ను ఏదో మామూలు సందేశంలా భావించి నిర్లక్ష్యం చేయకండి. కాస్త సమయం తీసుకుని చదవండి, ఆలోచించండి. ఇది ఒక ఉపాధ్యాయుడి మనసులోని తీవ్రమైన వేదన నుండి వచ్చిన ఆవేదనాభరిత మాటలు...

ఇది ఒక స్కూల్ ఉపాధ్యాయుడి ఆవేదన. సమాజంలో అత్యంత గౌరవనీయమైన స్థానంలో ఉండే ఉపాధ్యాయులు అంత నిస్సహాయంగా చేతులు జోడించి క్షమాపణ చెబుతుంటే ఎవరికైనా బాధ కలుగుతుంది.

"తల్లి తండ్రి గురువు దైవం" అంటారు. అంటే దైవం కూడా గురువు తరువాతే అనేది మన నిశ్చితాభిప్రాయం. అటువంటి గురువులు తాము చేసిన పనికి క్షమించమని వేడుకోవటం అనేది సభ్య సమాజం తలదించుకోవలసిన విషయం. వారు విద్యార్థులను దండించారో, లేక పిల్లలను దండించారో ఎవరు నిర్ణయించగలరు? విద్యను అర్థించే వారిని గురువులు కావాలని దండిస్తారని అనుకోలేం. పిల్లలు అల్లరి చేస్తే తల్లిదండ్రులు దండించినట్లుగానే దండించాము అని ఉపాధ్యాయులు స్పష్టం చేస్తున్నారు. అది కూడా చిన్న దండన మాత్రమే అనేది వారి వాదన. మన చట్టాల ప్రకారం పిల్లలను మానసికంగా శారీరకంగా దండించే హక్కు తల్లిదండ్రులకూ లేదు, ఉపాధ్యాయులకు అంతకన్నా లేదు.

చదువు ఒక్కటే చెబితే చాలనుకునే ఉపాధ్యాయులను ఇలాంటి చట్టాలు ఏమీ చేయలేవు. కానీ విద్యార్థులను విజ్ఞానవంతులుగా చేసి, ఉత్తమమైన వ్యక్తులుగా తీర్చిదిద్దాలని అనుకునే ఉపాధ్యాయులకే ఇది క్లిష్టతరంగా మారుతోంది. పిల్లలకు ప్రేమగా నచ్చచెప్పి విద్యాబోధన చేయాలి; తప్పు చేస్తే అనునయిస్తూ వారిని తప్పుడు మార్గంలోకి వెళ్లకుండా చూడాలి; అల్లరి చేసినా ప్రేమగా మందలించాలి; వారు సరిగా చదవకపోతే శ్రద్ధగా చదివించాలి. వారిని దండించకుండానే చదివించాలి—ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయులు పాటించవలసిన నిబంధనలు ఇవే. నిబంధనలు ఉండవలసిందే, అయితే ఆ నిబంధనలు అభివృద్ధి చెందిన దేశాలలో అమలు అవుతున్నంత నిక్కచ్చిగా ఇక్కడ అమలు కావడం లేదు.

భారతదేశంలో విద్యకు పెరుగుతున్న ప్రాముఖ్యత మన విద్యావిధానంలో అనేక మార్పులు తీసుకువస్తున్నది. గతంలో కంటే మౌలిక వసతులు మెరుగుపడ్డాయి. పార్టీలకు అతీతంగా ప్రభుత్వాలు విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలను అందించేందుకు కృషి చేస్తున్నాయి. విద్యా ప్రైవేటీకరణ వలన మేలు జరిగిందా, కీడు జరుగుతున్నదా అనే అంశాన్ని పక్కన పెడితే నిరక్షరాస్యతను రూపుమాపడంలో ప్రభుత్వం కొంత ప్రగతిని సాధించిన మాట వాస్తవం. మెరుగైన విద్యా ప్రమాణాలు అందరికీ సమానంగా అందుబాటులోకి రాకపోయినా, ఇప్పుడిప్పుడే పిల్లల జిజ్ఞాస ఆధారంగా విద్యను అందించాలనే అవగాహనతో ప్రభుత్వాలు ముందుకు వెళ్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు ఇక్కడ తమ శాఖలను విస్తరింపజేయాలని ముఖ్యమంత్రులు చేస్తున్న విజ్ఞప్తులు కూడా సఫలమవుతున్నాయి; ఇదొక శుభపరిణామమే.

అయితే ప్రపంచంతో పోటీపడే స్థాయికి మన విద్యార్థులు, యువత ఎదగాలంటే దానికి పునాది వేయవలసిన ఉపాధ్యాయులు ఇంతగా బాధపడుతూ పోస్ట్ పెట్టే పరిస్థితి ఉంటే అది సాధ్యమేనా? మన సంస్కృతిలో అమ్మ అన్నం పెడితే, నాన్న బడికి పంపుతాడు. కానీ ఉపాధ్యాయుల బాధ్యత కేవలం అక్షరాలు నేర్పడంతోనే సరిపోదు; వారిని విజ్ఞానవంతులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలి. ఆ క్రమంలో పిల్లలను దండించకూడదు అనే మాటకు అందరమూ కట్టుబడి ఉన్నప్పటికీ, మన దేశంలో నెలకొని ఉన్న పరిస్థితుల్లో కనీసం మందలించకుండా, దండించకుండా అది ఎంతవరకు సాధ్యం?

ప్రపంచంలోనే అత్యున్నత విద్యా విధానంగా ప్రశంసలు అందుకునే నార్వేలో ప్రతి పది మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉంటారు. అమెరికాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి పదిహేను మందికి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రతి పది మందికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారు. అదే మన దేశంలో గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఏక ఉపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి; అక్కడ ప్రతి నలభై మందికి ఒక టీచర్ మాత్రమే ఉంటారు. సాధారణ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి ఆశించిన స్థాయిలో లేదు.

పైగా ఆ అభివృద్ధి చెందిన దేశాలలో ఉపాధ్యాయులకు బోధన ఒక్కటే ప్రధాన బాధ్యత. మన దేశంలో పాఠశాల విధులతో పాటు జనాభా లెక్కల సేకరణ, ఎన్నికల విధులు, వివిధ యాప్‌లలో సమాచారం నమోదు చేయడం (డిజిటల్ డేటా ఎంట్రీ) లాంటి అనేక అదనపు విధులు ఉంటున్నాయి. ఇన్ని బాధ్యతల ఒత్తిడి మధ్య పిల్లలను కనీసం దండించకుండా, కేవలం అనునయిస్తూ చదువు చెప్పడమే కాక వారి ప్రవర్తనను పూర్తిగా తీర్చిదిద్దగలరా? ఆ దేశాల విద్యావిధానానికి, మన దేశ విద్యావిధానానికి ఎంత వ్యత్యాసం!

నార్వే వంటి దేశాల్లో తరగతి గదిలో కేవలం పాఠ్యపుస్తక బోధన చాలా తక్కువగా ఉంటుంది; అక్కడ టీచర్లు నిర్దేశిత విద్యా ప్రమాణాలను పాటిస్తే సరిపోతుంది. పాఠశాలల్లో బోధనా సిబ్బంది ఏ నిష్పత్తిలో ఉంటారో, సైకాలజిస్టులు, కౌన్సెలర్లు వంటి బోధనేతర సిబ్బంది కూడా తగిన నిష్పత్తిలో ఉంటారు. పిల్లలు ఎవరైనా ప్రక్కదారి పట్టే ఆలోచన చేస్తున్నారు అనిపిస్తే, ఆ దేశాల పాఠశాలల్లో ఉండే కౌన్సెలర్లు, మానసిక నిపుణులు బాధ్యత తీసుకుని వారిని సరిదిద్దుతారు. మన దగ్గర ఇంకా అటువంటి వ్యవస్థ పూర్తిస్థాయిలో లేదు. ఆదేశాలలో పొరపాటున ఉపాధ్యాయుల పైన చర్యలు తీసుకోవాల్సి వస్తే చట్టంలో పొందుపరిచిన నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తారు. మనదేశంలో మాదిరిగా ఉపాధ్యాయులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి వరండాలలో రెండు రోజులు పడిగాపులు పడే పరిస్థితిని మాత్రం కల్పించరు. మనదేశంలో జువనైల్ చట్టాలను కఠినంగా అమలు చేయాలనుకున్నప్పుడు అందుకు తగిన వాతావరణాన్ని కూడా కల్పించాలి. ఉపాధ్యాయులకు బోధనా విధులు మినహాయించి ఇతర పరిపాలనాపరమైన అదనపు భారాలు మోపకూడదు. అంటే పాఠశాలల్లో బాత్రూములు శుభ్రంగా ఉన్నాయా లేవా అని పరిశీలించడం, మధ్యాహ్న భోజన పథకంలో వచ్చిన భోజనం ప్రభుత్వం నిర్దేశించినట్లుగా ఉన్నదా లేదా అని గమనించడం, లాంటి అదనపు బాధ్యతలు ఉండకూడదు. విద్యార్థి-ఉపాధ్యాయుల నిష్పత్తి ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా లేకుండా సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలి.

అప్పుడే తరగతి గదిలోకి విద్యార్థి రాగానే, అమెరికా వంటి దేశాల్లో మాదిరిగా ఉపాధ్యాయుడు "నువ్వు ఈరోజు సంతోషంగా ఉన్నావా?" అని ప్రేమగా అడిగే పరిస్థితులు క్షేత్రస్థాయిలో సాధ్యమవుతాయి.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

### సెప్టెంబర్ 22

SEP 22

- 1791: ఆంగ్ల రసాయన, భౌతిక శాస్త్రవేత్త మైకేల్ ఫారడే జననం (మ.1867).
- 1930: భారతీయ చలనచిత్ర నేపథ్యగాయకుడు ప్రతివాది భయంకర శ్రీనివాస్ జననం (మ.2013).
- 1952: భారత స్వాంతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నాటక కర్త అడివి బాపిరాజు మరణం (జ.1895). (చిత్రంలో)
- 1977: అనువాదకురాలు, ప్రజాసేవకురాలు రామినేని రామానుజమ్మ మరణం (జ.1880).
- 2011: భారత మాజీ టెస్ట్ క్రికెట్ క్రీడాకారుడు మన్సూర్ అలీ ఖాన్ పటౌడి మరణం (జ.1941).



అడివి బాపిరాజు

- 1988: భారతీయ నటి, మోడల్ సనా సయీద్ జననం.
- 1965: ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణ పిలుపునిచ్చిన తర్వాత కాశ్మీర్‌పై భారతదేశం, పాకిస్తాన్ మధ్య 1965 నాటి ఇండో-పాకిస్తాన్ యుద్ధం ముగిసింది.

## ఏపీలో జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ పెంపు

అమరావతి: జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. స్టైపెండ్ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు 10 శాతం, పీజీ వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులకు 3.5 శాతం స్టైపెండ్ పెంచింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది.



### టీచర్లపై దాడికి యత్నించడం

## హేయమైన చర్య: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ: శాప్ కార్యాలయం వద్ద వైకాపా నేతల తీరును మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. జోగి రమేశ్, దేవినేని అవినాశ్ రౌండీ గ్యాంగులతో శాప్ కార్యాలయం వద్ద రాళ్లు, కోడిగుడ్లతో అల్లర్లకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్య అని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మంత్రి మాట్లాడారు. "డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై దౌర్జన్యం చేయడం దుర్మార్గం. కష్టపడి ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులు, ఉపాధ్యాయులను అవమానించడం సరికాదు. ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యబద్ధం కాదు. శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకొనే



అవకాశం ఉన్నా ఉద్రిక్తతలు సృష్టించడం తగదు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం వైకాపా నేతల విజ్ఞతకే వదిలేస్తున్నాం" అని మంత్రి అన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో

## సమన్వయంతో ముందుకెళ్తాం

: పీవీఎన్ మాధవ్

రాజమహేంద్రవరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని అన్ని పార్టీలతో సమన్వయం చేసుకొని ముందుకెళ్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో సేవా సంకల్ప్‌లో భాగంగా భాజపా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులనే బరిలో దించుతామన్నారు. ఈ విషయంలో పార్లమెంట్ స్థాయిలో సమన్వయ కమిటీలు సమావేశమై నిర్ణయం తీసుకుంటాయన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో మంచి సానుకూలత ఉందన్నారు. గత వైకాపా ప్రభుత్వం అనేక కుంభకోణాలు చేసిందని అందుకే ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా పక్కన పెట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తిరుమలలో



కల్తీ నెయ్యి కారకులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అప్పట్లో పెద్ద ఎత్తున మద్యం కుంభకోణం జరిగిందని, నాసిరకమైన బ్రాండ్లను రాష్ట్రంలో విక్రయించి ప్రాణాలు తీశారన్నారు. ఆ కుంభకోణంలో రూ.3200 కోట్లు కుంభకోణం జరగ్గా గత ముఖ్యమంత్రి జగన్‌కే మద్యం ముడుపులు వెళ్లాయని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా అందరం కలిసి ముందుకు వెళ్తామన్నారు.

## సాయికృష్ణ కేసు.. ఛార్జిషీట్ దాఖలు చేసిన సిట్

విజయవాడ: సాయికృష్ణ కేసులో సిట్ అధికారులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసుల దాడిలో సాయికృష్ణ మరణించినట్లు సిట్ పేర్కొంది. సాయికృష్ణ అరెస్టు, పోలీసుల దాడి, హత్యపై ఆధారాలు సమర్పించింది. అతడి మిస్సింగ్ నుంచి మృతి వరకు జరిగిన పరిణామాలను ఛార్జిషీట్‌లో పొందుపర్చింది. సిట్ ఐవో సుధాకర్‌బాబు స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసును నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు సిట్ విచారణ చేపట్టింది. ఏడుగురిని నిందితులుగా చేర్చి, వారిని అరెస్టు చేసింది.

# మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్



- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫక్రుద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్,



ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (PMKSY) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# తిరుమల భక్తులకు అలర్ట్.. ఎస్ఎస్‌డీ టోకెన్ల రద్దు పొడిగింపు

- సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో పెరిగిన రద్దీ
- ఎస్ఎస్‌డీ టోకెన్ల రద్దును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించిన టీటీడీ
- నిన్న స్వామి వారిని దర్శించుకున్న 72,019 మంది భక్తులు



శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం అందించింది. కొండపై రికార్డు స్థాయిలో భక్తుల రద్దీ పెరుగుతుండటంతో వారి సౌకర్యార్థం, నియంత్రణ కోసం ఉచిత సర్వదర్శనం టైమ్ స్లాట్ (ఎస్ఎస్‌డీ) టోకెన్ల నిలిపివేతను మరో నాలుగు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. మొదట సెప్టెంబర్ 14 నుంచి 20 వరకు మాత్రమే ఈ టోకెన్ల జారీని రద్దు చేయగా, రద్దీ ఒత్తిడి తగ్గకపోవడంతో సెప్టెంబర్ 24వ తేదీ వరకు రద్దు ప్రక్రియను పొడిగిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. తిరిగి సెప్టెంబర్ 25 నాటి దర్శనానికి సంబంధించిన ఎస్ఎస్‌డీ టోకెన్లను సెప్టెంబర్ 24న తిరుపతిలోని కౌంటర్లలో పంపిణీ చేయనున్నారు

మరోవైపు, బ్రహ్మోత్సవాలు ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ ఉదయం శ్రీమలయప్పస్వామి సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. నిన్న ఒక్కరోజే 72,019 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 25,431 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.3.5 కోట్లు వచ్చినట్లు టీటీడీ వెల్లడించింది.

# స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై దాడి.. వైకాపా క్రూర మనస్తత్వానికి నిదర్శనం

* **సయ్యద్ మెహతాజ్ బేగం**





రైల్వే కోడూరు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (SAAP) కార్యాలయం వద్ద తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు, తమకు న్యాయం చేయాలని కోరుతూ వచ్చిన స్పోర్ట్స్ కోటా మెగా డీఎస్సీ ఉపాధ్యాయులపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ శ్రేణులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ మెహతాజ్ బేగం తెలిపారు. శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన ఉపాధ్యాయులపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆమె అన్నారు. రాజకీయ విభేదాలు, ఆరోపణలు ఏమైనా ఉంటే వాటిని చట్టబద్ధమైన మార్గంలో పరిష్కరించుకోవాలని, కానీ ఉపాధ్యాయులపై దాడులకు దిగడం మాత్రం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు. క్రీడా రంగంలో ఎన్నో సంవత్సరాలు కష్టపడి, మైదానాల్లో శ్రమించి, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ కోటా ద్వారా అర్హత సాధించిన ఉపాధ్యాయులను రాజకీయ కక్షలకు గురిచేయడం సరికాదని సయ్యద్ మెహతాజ్ బేగం అన్నారు. "ఉపాధ్యాయులు తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడానికి వస్తే వారిపై దాడి చేయడం ఎంతవరకు న్యాయం? ఏదైనా ఆరోపణ ఉంటే ఆధారాలతో అధికారులను ఆశ్రయించాలి. విచారణ కోరాలి. అంతేకానీ చేతులతో, వాటర్ బాటిళ్లతో దాడులకు దిగడం ప్రజాస్వామ్య పద్ధతి కాదు. ఇలాంటి దౌర్జన్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం" అని ఆమె అన్నారు. స్పోర్ట్స్ కోటా నియామకాలకు సంబంధించి ఏవైనా అనుమానాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం విచారణ జరిపించాలని ఆమె సూచించారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని, అర్హులైన అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. అయితే సమస్యను పరిష్కరించాల్సిన సమయంలో ఉపాధ్యాయులపై దాడులు చేయడం వల్ల పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుందని ఆమె అన్నారు. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులపై దాడి చేయడం సమాజానికి తప్పుడు సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

"అధికారం ఉన్నా లేకపోయినా ప్రతి రాజకీయ పార్టీ ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి. ప్రజలను, ఉపాధ్యాయులను, ఉద్యోగులను గౌరవించడం రాజకీయ పార్టీల బాధ్యత. దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులతో ప్రజా సమస్యలకు పరిష్కారం రాదు" అని సయ్యద్ మెహతాజ్ బేగం పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులకు పూర్తి భద్రత కల్పించాలని, వారి గౌరవానికి భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. నియామకాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారికంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని సూచించారు. "ఉపాధ్యాయులపై దాడులు చేసి వారి గొంతు నొక్కాలని చూడటం ఎప్పటికీ పరిష్కారం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ సమస్యను చెప్పుకునే హక్కు ఉంది. ఆ హక్కును గౌరవించాలి. స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై జరిగిన దాడిని మరోసారి తీవ్రంగా ఖండిస్తున్నాం. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి" అని సయ్యద్ మెహతాజ్ బేగం డిమాండ్ చేశారు.

# ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి





ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత.. టీచర్లు వర్సెస్ వైసీపీ.. తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్

- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం
- తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక
- గురువులపై దాడులను సహించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి



విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు.

**శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?**

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు. అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

* **వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు**

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు. సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# లిక్కర్ స్కామ్‌ను పక్కదారి పట్టించేందుకే వైకాపా రాద్ధాంతం: అనిత

అమరావతి: టీచర్లపై దాడులకు దిగడం హేయమైన చర్య అని హోం మంత్రి అనిత అన్నారు. స్పోర్ట్స్ కోటా టీచర్ల అంశంపై గొడ్డలి పార్టీ నేతలకు సమాధానం ఇచ్చేందుకు శాప్ ఎండీ సిద్ధమయ్యారని.. కానీ వారు ఎండీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ధైర్యం చేయలేకపోయారన్నారు. పోలీసులు తీసుకెళ్తామన్నా.. గేటు బయట అల్లర్లకు



పాల్పడ్డారని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌ను పక్కదారి పట్టించేందుకే ఈ రాద్ధాంతమని విమర్శించారు. "ఎన్ని కష్టాలు పడితే టీచర్ ఉద్యోగం వస్తుందో జగన్‌కు తెలుసా? గొడ్డలి పార్టీ తరపున వచ్చినవారిలో విద్యపై అవగాహన ఉన్నవారు ఒక్కరైనా ఉన్నారా? ఒక్కరైనా ఏదైనా పరీక్ష రాశారా? టీచర్లపై దాడులు చేసేవారికి ప్రజాస్వామ్యంలో చోటులేదు. శాప్ కార్యాలయంపైకి వచ్చిన వారి వీడియోలన్నీ పరిశీలించాం. వచ్చిన వారంతా రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులే. ఒక్కరిని కూడా వదిలిపెట్టకుండా అందరిపై కేసులు నమోదు చేస్తాం" అని మంత్రి అనిత తెలిపారు.

# ఆన్‌లైన్ రాడికలైజేషన్ కేసు.. తొమ్మిది మందిపై ఎన్ఐఏ ఛార్జిషీట్

విజయవాడ: ఆన్‌లైన్ వేదికగా యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షిస్తున్న కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ విచారణను వేగవంతం చేసింది. ఈ కేసుకు సంబంధించి విజయవాడలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో తొమ్మిది మంది నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలోని విజయవాడ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఈ ఏడాది మార్చి 23న నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్ఐఏ ఈ కేసు దర్యాప్తు చేసింది. ఇప్పటివరకు ఓ మైనర్ సహా 12 మందిని అరెస్టు చేసింది. ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి అమాయక యువతను ఉగ్రవాద కార్యకలాపాల వైపు ఆకర్షించేందుకు నిందితులు కుట్ర పన్నినట్లు ఎన్ఐఏ గుర్తించింది. పేలుడు పదార్థాల తయారీ, ఆయుధ శిక్షణకు పక్కా ప్రణాళిక





రూపొందించినట్లు తెలిపింది. ఎవరికీ అనుమానం రాకుండా సొంతంగా కమ్యూనికేషన్ యాప్‌ను కూడా అభివృద్ధి చేసి పరీక్షించినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడైంది.

# ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న వాయుగుండం.. ఐఎండీ అప్ డేట్ ఇదిగో!

- **పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం**
- **ప్రస్తుతం విశాఖకు 470 కి.మీ. దూరంలో కేంద్రీకృతం**
- **రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే సూచన**
- **సెప్టెంబర్ 23న రాత్రి ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరం దాటే అవకాశం**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఉత్తరాంధ్రదక్షిణ ఒడిశా తీరం వైపు దూసుకొస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతం ఈ వాయుగుండం ఒడిశాలోని పూరీకి ఆగ్నేయంగా 310 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు తూర్పు ఆగ్నేయంగా 310 కిలోమీటర్ల దూరంలో ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నానికి 390 కిలోమీటర్లు, విశాఖపట్నానికి తూర్పున 470 కిలోమీటర్ల దూరంలోకేంద్రీకృతమైకొనసాగుతోంది.



రాబోయే 24 గంటల్లో ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత కూడా ఇదే దిశలో కదులుతూ సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజాము మధ్యలో తీవ్ర వాయుగుండంగానే ఉత్తరాంధ్రదక్షిణ ఒడిశా తీరాలను దాటుతుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య ఇది తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరప్రాంతాల అధికారులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

## వైకాపాకు మరో షాక్..
# జనసేనలోకి మాజీ ఎమ్మెల్యే

అమరావతి: వైకాపాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ నేత, ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు జనసేనలో చేరారు. సోమవారం సాయంత్రం జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో పలువురు నేతలతో పాటు ఆయన పార్టీ కండువా కప్పుకొన్నారు. జనసేనలో చేరిన వారిలో పెద్దాపురం మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి



ప్రసాద్, సామర్లకోట మాజీ మున్సిపల్ ఛైర్మన్ గంగిరెడ్డి అరుణ, రెండు మున్సిపాలిటీల పరిధిలోని పలువురు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాలకు చెందిన కొందరు వైకాపా నేతలు ఉన్నారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి పవన్ జనసేనలోకి స్వాగతం పలికారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా.. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు చిన్న శ్రీను సైతం ఇటీవల వైకాపా నుంచి తెదేపాలో చేరిన విషయం తెలిసిందే.

# రోడ్లు ఊడ్చిన ఐ.ఆర్.ఎస్ అధికారి

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ ఆదేశాల మేరకు గుంటూరు కన్నావారి తోటలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ రజ్వాణి మరియు చిరు ఉద్యోగులు సోమవారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కన్నావారి తోట జీఎస్టీ భవన్ పరిసర ప్రాంతాలను జీఎస్టీ అధికారులు శుభ్రం చేసి, చెత్త ను తరలించారు. ఈ సందర్భంగా ఐ.ఆర్.ఎస్ అధికారి రజ్వాణి మాట్లాడుతూ.. జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ నేతృత్వంలో తమ శాఖ






స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ సంరక్షణను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి. రామకృష్ణ రాజు యాదవ్, సూపరింటెండెంట్ ఆర్. పి. పి కుమార్, ఇన్స్పెక్టర్లు శరత్, రోహిత్, పి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చాలా ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం: మంత్రి పొంగులేటి

రాయదుర్గం: క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులందరికీ ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా కొనసాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ''బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదు. అధికారం పోయాక.. పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు. గత ప్రభుత్వం నగరానికి దూరంగా.. ప్రజలు ఉండలేని



చోట ఇళ్లు నిర్మించింది. మేం రద్దీగా ఉండే, చాలా ఖరీదైన ప్రాంతాల్లో టవర్స్ నిర్మించి, ఇళ్లు ఇస్తున్నాం. పేదలయితే చాలు.. ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు మంజూరు చేస్తున్నాం. వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తాం'' అని తెలిపారు.

**ఎల్3 కేటగిరీపై కీలక నిర్ణయం**

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి విచారణలో అనర్హులుగా తేలిన వారిని అధికారులు ఎల్3 కేటగిరీలో పెట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఎల్3 కేటగిరీలో ఉన్నప్పటికీ ఇల్లు నిర్మాణం ప్రారంభించినవారికి ప్రత్యేక అనుమతి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఎల్3లో ఉన్నప్పటికీ.. బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభం కాని అనర్హులకు రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఎల్3 కేటగిరీలోని అనర్హులకు రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

## మచిలీపట్నం బీచ్‌లో
# వెల్లివిరిసిన భక్తి భావం

* **వైభవంగా సాగరతీర మహాగణపతి ఉత్సవాలు.. పోటెత్తిన భక్తజనం**

మచిలీపట్నం (ఆంధ్రప్రదేశ్): మచిలీపట్నం సాగరతీరంలో నిర్వహిస్తున్న మహాగణపతి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. సముద్ర తీరాన ఏర్పాటు చేసిన భారీ 63 అడుగుల మట్టి గణపతి భక్తులకు విశేషంగా దర్శనమిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో సాగరతీర పరిసరాలు భక్తుల రాకతో కిటకిటలాడాయి. ప్రధాన విగ్రహంతో పాటు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ద్వారకా తిరుమల, భద్రాద్రి




రామాలయం, సింహాచలం, అన్నవరం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల నమూనా ఆలయాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. భక్తులు భారీ క్యూలైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకుంటూ కొలాహలంగా పూజలు నిర్వహించారు.

# జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణం: జూపల్లి

జూరాల: జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాలలో ఆయన ఈమేరకు మాట్లాడారు. వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా? అని ప్రశ్నించారు. ''కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు. జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు. పాలమూరుపై అంత ప్రేమ ఉంటే రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదు? కేసీఆర్ రిజర్వాయర్లు కట్టకపోవడం వల్లే నీళ్లను నిల్వ చేసుకోలేకపోతున్నాం. పాలమూరు జిల్లాను ఎండబెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు. మా ప్రభుత్వంలో ఈ వాటా 43 శాతం వరకు ఉంది. నీటి కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ సర్కారు రాజీపడదు. 15 టీఎంసీలతో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు ఇచ్చాం. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి ఇంకా నీళ్లు వస్తాయని భావిస్తున్నాం. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకునే



ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం'' అని అన్నారు.

## 22ఏ నిషేధిత భూముల అంశం..
# సీఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

హైదరాబాద్: తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై సీఎస్ సంజయ్ జాజుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర విచారణ చేపట్టాలని ఆదేశించింది. తమ ఆదేశాల విషయంలో తీసుకున్న చర్యలపై 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని తెలిపింది. 22ఏ అంశంపై హైదరాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈమేరకు చర్యలు తీసుకుంది.




# రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- **ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్**
- **రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం**
- **బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ**
- **సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ**
- **అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్**

ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల



ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు.

జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## స్పీకర్‌ను దూషించిన కేసు.. తాతా మధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్: శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను దూషించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వారిని అరెస్టు చేయొద్దంటూ గతంలో నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. పీపీ నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌ను తాతా మధు, నవీన్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులపైనా దాడి చేశారని చెప్పారు. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డికి ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.



తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

# యూట్యూబర్ నందన దంపతులపై ప్రజావాణిలో ఫిర్యాదు

యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేసి మోసగించినట్లు యూట్యూబర్ నందన, ఆమె భర్త మధుకర్‌లపై ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ మేరకు బాధితులు సోమవారం ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

**బాధితుల కథనం ప్రకారం..**

యూకే ప్రభుత్వం తమ కన్సల్టెన్సీకి ఉద్యోగులు నియామక ప్రక్రియ కోసం అనుమతులు మంజూరు చేసిందని నందన, మధుకర్ దంపతులు నమ్మబలికారు. ప్రధానంగా స్టూడెంట్, విజిటర్ వీసాలపై యూకేకు వెళ్లి, వీసా గడువు ముగియనున్న వారిని లక్ష్యంగా చేసుకుని వర్క్ వీసాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ. 25 లక్షల నుంచి రూ. 95 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. అయితే, సదరు కన్సల్టెన్సీ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలడంతో యూకే ప్రభుత్వం తమపై కఠిన చర్యలు తీసుకుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో తెలంగాణలోని వికారాబాద్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారని వారు వివరించారు. సోమవారం బేగంపేటలోని జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో బాధితులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్‌పర్సన్, ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్, ఎన్నారై సలహా కమిటీ ఛైర్మన్ డాక్టర్ వినోద్ కుమార్‌లను కలిసి తమ సమస్యను విన్నవించారు.

# ఓటరు జాబితాలో పేరు అంశం.. సోనియా గాంధీకి మళ్లీ చిక్కులు

ఓటరు జాబితాలో పేరు అంశంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ కి మళ్లీ చిక్కులు ఎదురయ్యాయి. భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ.. గతేడాది కోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఈ వ్యవహారంలో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఆ పిటిషన్‌ను మేజిస్ట్రియల్ కోర్టు తిరస్కరించింది. ఆ ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌పై తాజాగా దర్యాప్తు చేపట్టిన దిల్లీ న్యాయస్థానం.. ఆ తీర్పును పక్కనబెట్టింది. దీంతో సోనియా పౌరసత్వ అంశంపై దర్యాప్తునకు మార్గం సుగమం అయ్యింది. మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు సరైన వివరణ లేనివని పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే వాటిని కొట్టివేశారు. చట్టపరమైన నియమాలు పాటించకపోవడం, సంబంధిత



అధికారి వాదనలను వినకపోవడం వంటి అనేక లోపాలు ఈ ఉత్తర్వులో ఉన్నట్లు గుర్తించామన్నారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 29కి వాయిదా వేశారు.

**ఏమిటీ కేసు..?**

1983లో సోనియాగాంధీకి భారత పౌరసత్వం వచ్చింది. అయితే 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గతేడాది ఆగస్టులో భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అందులో గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. పౌరసత్వం లేని సోనియా పేరును ఓటరు జాబితాలో చేర్చి అప్పటి కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపించారు.

## అయోధ్య రామాలయంలో 105 సార్లు విరాళాల చోరీ

అయోధ్య రామాలయంలో విరాళాల చోరీకి సంబంధించి సిట్ దర్యాప్తులో కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఒకట్రెండు సార్లు కాదు.. ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ గుర్తించింది. చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయినట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. చోరీకి పాల్పడిన వారందరినీ గుర్తించినట్లు వివరించింది. అయోధ్య విరాళాల చోరీ కేసుపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. సిట్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. దర్యాప్తులో గుర్తించిన వివరాలను న్యాయస్థానానికి వివరించారు. పూర్తిస్థాయి దర్యాప్తు త్వరలోనే పూర్తవుతుందని, సెప్టెంబర్ 25 లోపు ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు.



విచారణ సందర్భంగా న్యాయస్థానం పలు అంశాలను లేవనెత్తింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు ఎంతమందిని అరెస్టు చేశారు?ఆధారాల సేకరణ ఎంత వరకు వచ్చింది?తదితర అంశాలపై తుషార్ మెహతాను ప్రశ్నించింది. ఇప్పటి వరకు సేకరించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను కోర్టుకు సిట్ సమర్పించింది. దర్యాప్తు వివరాలకు సంబంధించిన కాపీలను తమకు కూడా ఇవ్వాలని పిటిషనర్లు కోరగా.. న్యాయస్థానం తిరస్కరించింది. నిధుల చోరీ కేసు వ్యవహారంలో తన డ్రైవర్ అరెస్టు కావడంతో శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి పదవికి చంపత్ రాయ్, మరో సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ట్రస్టులో సీఈవో నేతృత్వంలో పరిపాలనా వ్యవస్థను అమలు చేశారు. మాజీ సైనికాధికారి జితేంద్ర మిశ్రాను సీఈవోగా నియమించారు.

## సీఎం విజయ్‌పై ఎన్నో సందేహాలున్నాయ్..! కానీ,..: ప్రకాశ్ రాజ్

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత టీవీకే పార్టీపైనా, సీఎం విజయ్‌పైనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తాజాగా స్వరం మార్చారు. ప్రభుత్వం ఏర్పాటై 120 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ.. అప్పుడే విజయ్ పనితీరును అంచనా వేయడం పొరపాటు అవుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు ఆయన్ని జవాబుదారీగా నిలబెట్టేందుకు కనీసం సంవత్సరమైనా సమయమివ్వాలని అన్నారు. "సీఎం విజయ్, టీవీకేపై పలు సందేహాలున్నాయి. కేవలం టీవీకే పార్టీకి ఓట్లేసిన వారికే విజయ్ సీఎం కాదు.. రాష్ట్ర ప్రజలందరికీ సీఎం. ఆయన పనితీరుపై అప్పుడే ఓ



అంచనాకు రావడం సబబు కాదు. కనీసం ఏడాదైనా సమయమివ్వాలి" అని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఆందోళనలు జరుగుతుంటే.. ప్రజలు తమ డిమాండ్లను తెలియజెప్పేందుకే నిరసన చేస్తున్నారని భావించాలి తప్ప.. వాటిని అణిచివేసేందుకు ప్రయత్నించకూడదన్నారు. ఎవరు అధికారంలో ఉన్నా.. ఇదే వర్తిస్తుందని చెప్పారు. ఇటీవల విజయ్ యూకే పర్యటనకు వెళ్లడం, అక్కడ ప్రముఖ నటుడు అజిత్‌కుమార్‌తో కలిసి కారు రేసింగ్ పోటీలను వీక్షించడంపైనా ప్రకాశ్ రాజ్ స్పందించారు. అందులో తప్పేమీ లేదని, ఆయన ఏ పనిమీద అక్కడి వెళ్లారో దాన్ని నెరవేర్చుకొని వచ్చారా? లేదా? అన్నదే ముఖ్యమని చెప్పారు. విదేశీ పర్యటనకు వెళ్లి రూ.వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చానని విజయ్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. విజయ్‌పై ప్రకాశ్ రాజ్ తీవ్ర స్థాయిలో మండిపడిన సంగతి తెలిసిందే.

## అక్టోబర్ 20 నుంచి అమల్లోకి భారత్–న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ: గోయల్

దిల్లీ: భారత్ న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఇది ఇరుదేశాల మధ్య పెట్టుబడులు, వ్యాపారసంబంధాలు మెరుగుపడేందుకు దోహదం చేస్తుందన్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య ఏప్రిల్ 27న ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపైనా ఎలాంటి సుంకం ఉండదు. అంతేకాకుండా రానున్న 15 ఏళ్లలో న్యూజిలాండ్ 20 బిలియన్ యూఎస్ డాలర్ల మేర భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని గోయల్ తెలిపారు. "న్యూజిలాండ్‌తో మరింత బలమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు భారత్ నిబద్ధతతో వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే అక్టోబర్ 20న దసరా సందర్భంగా భారత్ న్యూజిలాండ్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం ప్రారంభం కాబోతోంది" అని గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం భారత్‌లోని వ్యవసాయ ఉత్పాదకతపైనా ప్రభావం చూపిస్తుందని, న్యూజిలాండ్ సాంకేతికత భారతదేశపు అవసరాలను, పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తుందని ఆయన పేర్కొన్నారు.



## మళ్లీ తెరపైకి ధర్మస్థల హత్యాచార కేసు

సుమారు 14ఏళ్లుగా మిస్టరీగా ఉన్న 'ధర్మస్థల' అత్యాచారం, హత్య కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ కేసులో మళ్లీ దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని పేర్కొంది. 2012 అక్టోబర్ 9న ధర్మస్థలలో 17 ఏళ్ల యువతి అపహరణకు గురై.. మరుసటి రోజు నేత్రావతి నది సమీపంలో శవమై కనిపించించిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. కేసును తొలుత కర్ణాటక సీఐడీ (CID) దర్యాప్తు చేయగా.. అనంతరం సీబీఐ(CBI) కి అప్పగించారు. ఈ కేసులో సంతోష్‌రావు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. తగిన ఆధారాలు లేకపోవడంతో 2023లో సీబీఐ స్పెషల్ కోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసింది. బాధితురాలి తల్లి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. గత దర్యాప్తులో కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆమె ఆరోపించారు. కేసులో సరైన దర్యాప్తు జరగలేదని



పేర్కొంటూ మళ్లీ విచారణ జరపాలని కోరారు. ఈ మేరకు పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. కేసును పునర్విచారణ చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ కేసులో న్యాయం జరుగుతుందా? అసలు నేరానికి పాల్పడింది ఎవరు? అనే ప్రశ్నలకు ఈసారైనా సమాధానాలు లభిస్తాయా అనేది ఆసక్తికరంగా మారింది.

## రాజీనామా చేసిన అభ్యర్థుల నుంచి పరిహారం ఆదేశించలేం: మద్రాసు హైకోర్టు

చెన్నై: రాజీనామా చేసిన వ్యక్తి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే.. ఆ వ్యక్తి నుంచి పరిహారం వసూలు చేయాలని తాము భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేమని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ఏ ప్రాతిపదికన ఆదేశాలు జారీ చేయగలమని ప్రశ్నించింది. రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో పోటీ చేసే వారి నుంచి నష్టపరిహారం వసూలు చేయడానికి ఇంకా ఎటువంటి చట్టం లేదని పేర్కొంది. అసలు చట్టమే లేనప్పుడు, నష్టపరిహారం వసూలు చేయాలని కోర్టు ఎలా ఆదేశించగలదని ప్రశ్నించింది. కేసుల కోసం న్యాయస్థానాలు చట్టాలను రూపొందించలేవని స్పష్టం చేసింది. ఒకస్థానం నుంచి గెలిచి..



ఆ స్థానానికి రాజీనామా చేసిన అభ్యర్థులు పరిహారం చెల్లించేలా ఆదేశించాలని దాఖలైన పిల్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడులో కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధురాంతకం, ధారాపురం సహా పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి గెలుపొందిన కొందరు ఎమ్మెల్యేలు కొన్ని రోజులకే రాజీనామా చేసి అధికార టీవీకేలో చేరారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రెండు స్థానాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనుంది. దీనిని సవాలు చేస్తూ చెన్నైకి చెందిన ఓ న్యాయవాది మద్రాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

# సూర్యప్రభ వాహనంపై శ్రీ మలయప్పస్వామి దివ్య వైభవం

**తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన సోమవారం మలయప్పస్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్యదర్శనం అనుగ్రహించారు. స్వామివారి రాకతో తిరుమాఢ వీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.**


















# ₹20 వేలకే 3D కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లేతో లావా కొత్త స్మార్ట్‌ఫోన్




మెమోరీ చిప్‌లు ప్రియం కావడంతో స్మార్ట్‌ఫోన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఎంట్రీ లెవల్ ఫీచర్లు కలిగిన స్మార్ట్‌ఫోన్లకు కూడా రూ.15వేల వరకు పెట్టాల్సి వస్తోంది. రూ.30 వేలు బడ్జెట్ పెట్టినా ఎల్‌సీడీ డిస్‌ప్లే కలిగిన ఫోన్లే దిక్కు. ఈ పరిస్థితుల్లో దేశీయ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ లావా బడ్జెట్ ధరలో విరాట్ కర్వ్ 5జీ పేరిట కొత్త స్మార్ట్‌ఫోన్ ను లాంచ్ చేసింది. 3డీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లేతో దీన్ని తీసుకొచ్చింది. లావా విరాట్ కర్వ్ 5జీ స్మార్ట్‌ఫోన్ ఆండ్రాయిడ్ 16పై పనిచేస్తుంది. రెండేళ్లపాటు మేజర్ ఓఎస్ అప్‌డేట్స్, మూడేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. ఇందులో 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ 3డీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120 Hz రిఫ్రెష్ రేటు ఉంది. 1100 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. వెనుక వైపు మినీ డిస్‌ప్లే కూడా ఇచ్చారు. దీని సాయంతో వాల్యూమ్ లెవల్, బ్యాటరీ పర్సంటేజీ, టైమ్, నోటిఫికేషన్లు వంటివి చూసుకోవచ్చు. ఈ స్మార్ట్‌ఫోన్‌లో మీడియాటెక్ డైమెన్‌సిటీ 7100 ప్రాసెసర్ అమర్చారు. 6జీబీ ర్యామ్‌తో వస్తున్న ఈ స్మార్ట్‌ఫోన్‌లో 6జీబీ వర్చువల్ ర్యామ్ సదుపాయం కూడా ఉంది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, సెల్ఫీల కోసం 13 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఐఆర్ బ్లాస్టర్ కూడా ఉంది. ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఫేస్ అన్‌లాక్ వంటి సదుపాయాలు ఉన్నాయి. 6000 ఎంఏహెచ్ బ్యాటరీ 45W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. బాక్సుతో పాటు 33W ఫాస్ట్ ఛార్జర్‌ను అందిస్తున్నారు. ధర విషయానికొస్తే.. ఇది కేవలం సింగిల్ వేరియంట్‌లో లభిస్తుంది. 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్ ధరను కంపెనీ రూ.23,999గా కంపెనీ నిర్ణయించింది. బ్యాంక్ ఆఫర్‌తో రూ.19,999కు కొనుగోలు చేయొచ్చని కంపెనీ చెబుతోంది. ఎల్లోరా స్లేట్, హెరిటేజ్ ఇండిగో, మాక్రానా ఐవరీ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌లో సెప్టెంబర్ 28 నుంచి విక్రయానికి రానుంది.

# సింగపూర్ ఎయిర్‌లైన్స్ టాప్.. ఎయిరిండియా, ఇండిగో స్థానమెంత?



ప్రపంచంలోనే అత్యుత్తమ విమానయాన సంస్థగా సింగపూర్ ఎయిర్‌లైన్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఖతార్ ఎయిర్‌వేస్, కాథే పసిఫిక్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ మేరకు స్కైట్రాక్స్ వార్షిక జాబితాను విడుదల చేసింది. భారత్‌కు చెందిన ఎయిరిండియా సంస్థ 57వ స్థానంలో నిలవగా.. ఇండిగో 61వ స్థానం సాధించింది. 2025 సెప్టెంబర్ 25 నుంచి 2026 ఆగస్టు మధ్య 300 విమానయాన సంస్థలకు సంబంధించి ప్రయాణికుల నుంచి స్వీకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను స్కైట్రాక్స్ రూపొందించింది. 2025లో రెండో స్థానంలో ఉన్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఈ సారి అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. అదే సమయంలో ఖతార్ ఎయిర్‌వేస్ మొదటి స్థానం నుంచి రెండో స్థానానికి పడిపోయింది. కాథే పసిఫిక్ మాత్రం తన స్థానాన్ని నిలుపుకొంది. భారత్ తరఫున ఎయిరిండియా 57వ స్థానంలో నిలిచింది. 2025తో పోలిస్తే 25 స్థానాలను మెరుగుపరుచుకుంది. ఇండిగో గతేడాదితో పోలిస్తే 22 స్థానాలు కోల్పోయి 61వ స్థానానికి దిగజారింది. భారత్, దక్షిణాసియా ప్రాంతీయ ర్యాంకింగ్స్‌నూ స్కైట్రాక్స్ ప్రకటించింది. ఇందులో ఎయిరిండియా, ఇండిగో ఒకట్రెండు స్థానాల్లో నిలిచాయి. ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్, స్పైస్‌జెట్, బియాండ్, బిమన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్, పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్, మాల్దీవియన్ విమాన సంస్థలు టాప్ 10 స్థానాల్లో ఉన్నాయి. భారత్‌కు చెందిన ఎయిరిండియా, ఇండిగో మాత్రమే గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నాయి. ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్‌కు గ్లోబల్ టాప్ 100లో చోటు దక్కలేదు.

# చైనా 'యూట్యూబ్'పై మన కంటెంట్ క్రియేటర్ల ఆసక్తి




కంటెంట్ క్రియేటర్లు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు నిబంధనలు కఠినతరం చేస్తుండడంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే చైనాకు చెందిన ప్రముఖ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ బిలిబిలిపై ఆసక్తి చూపుతున్నారు. చైనా యూట్యూబ్‌గా పేరొందిన ఈ ప్లాట్‌ఫామ్‌లో అనధికారికంగా కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు.

**ఏమిటీ బిలిబిలి**

చైనాలో 2009లో ప్రారంభమైందీ ప్లాట్‌ఫామ్. తొలుత యానిమే, కామిక్స్, గేమింగ్ కంటెంట్‌తో మొదలైంది. ప్రస్తుతం టెక్నాలజీ, ఎంటర్‌టైన్‌మెంట్, లైఫ్‌స్టైల్, నాలెడ్జ్ వంటి విభిన్న రంగాలకు విస్తరించింది. 2025 మూడో త్రైమాసికం నాటికి దీనికి 37.6 కోట్ల మంత్లీ యాక్టివ్ యూజర్లు ఉన్నారు. వినియోగదారులు రోజుకు సగటున 112 నిమిషాలు ఇందులో గడుపుతున్నారని కంపెనీ చెబుతోంది.

**ఇతర దేశాలకు విస్తరణ**

యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్‌లకు పోటీగా చైనాకు చెందిన బిలిబిలి.. అంతర్జాతీయంగా విస్తరించేందుకు సన్నద్ధమవుతోంది. ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం, సింగపూర్, మలేసియా వంటి దేశాలకు ఇప్పటికే విస్తరించింది. ఆండ్రాయిడ్ యూజర్ల కోసం ఇంటర్నేషనల్ యాప్‌ను కూడా తీసుకొచ్చింది. త్వరలో మరికొన్ని దేశాలకూ విస్తరిస్తామని కంపెనీ ప్రకటించింది. అయితే, ఆ జాబితాలో ప్రస్తుతానికి భారత్ లేదు.

**భారత క్రియేటర్లు ఆసక్తి**

భారత్‌కు చెందిన కొంతమంది క్రియేటర్లు ఇప్పటికే బిలిబిలిలో కంటెంట్‌ను పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. ఝార్ఖండ్‌కు చెందిన ట్రావెల్ వ్లాగర్ నవనీత్‌కుమార్ తివారీ ఇటీవల బిలిబిలిలో వీడియో పోస్ట్‌చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు. 15 రోజుల వ్యవధిలోనే అక్కడి నుంచి మంచి స్పందన వచ్చిందని, వ్యూస్ కూడా బాగున్నాయని పేర్కొన్నాడు. మరికొందరు కంటెంట్ క్రియేటర్లు ఆయన మార్గాన్ని అనుసరిస్తున్నారు. భారత్‌లో అధికారికంగా అందుబాటులో లేకపోవడంతో వీపీఎన్, సైడ్‌లోడెడ్ ఏపీకే (APK), ఫోన్ లొకేషన్ సెట్టింగ్‌లు మార్చడం వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఈ ప్లాట్‌ఫామ్‌ను కంటెంట్ క్రియేటర్లు వినియోగిస్తున్నారు.

**కొత్త ఆదాయ మార్గం**

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ లకు అదనంగా మరో ప్లాట్‌ఫామ్ ద్వారా కొత్త ఆడియన్స్‌ను చేరుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని కంటెంట్ క్రియేటర్లు భావిస్తున్నారు. ముఖ్యంగా గేమింగ్, టెక్నాలజీ, ట్రావెల్, నాలెడ్జ్ ఆధారిత కంటెంట్ రూపొందించే వారికి ఇది విస్తృత అవకాశాలను కల్పిస్తుండడం ఇందుక్కారణం. ఇప్పటికే ఉన్న వీడియోలతోనే అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకర్షించేందుకు దీన్నో ప్రత్యామ్నాయ మార్గంగా పరిశీలిస్తున్నారు. దీనికితోడు యూట్యూబ్ తన మానిటైజేషన్ ప్రోగ్రామ్‌ను కఠినతరం చేయడమూ దీనికి మరో కారణంగా టెక్ నిపుణులు చెబుతున్నారు. చైనాతో ఘర్షణల కారణంగా టిక్‌టాక్‌పై భారత్ నిషేధం విధించింది. ఇప్పుడు ఇరు దేశాల మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడ్డాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోకి బిలిబిలి ఎంట్రీకి అవకాశం లభిస్తుందా? లేదా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే అంటున్నారు విశ్లేషకులు.

# భారత్ జపాన్ ఏకైక టీ20కి టైఫూన్ ముప్పు?




భారత క్రికెటర్లు జపాన్‌తో ఏకైక టీ20 మ్యాచ్ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. భారత్ జపాన్ 75 ఏళ్ల స్నేహానికి గుర్తుగా ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌కు వేదిక సానో క్రికెట్ స్టేడియం. అయితే, ప్రస్తుతం అక్కడి వాతావరణం ఆందోళన కలిగిస్తోంది. టైఫూన్ దుజాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడతాయని అక్కడి వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో చరిత్రాత్మకమైన మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడుతుందా? అనే అనుమానాలు మొదలయ్యాయి. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9.30గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం సానో స్టేడియం ఉన్న కాంటో ప్రాంతంలో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. అయితే, మ్యాచ్ నాటికి పరిస్థితులు కాస్త మెరుగవుతాయని స్థానిక అధికారులు భావిస్తున్నారు.

**ఆసియా క్రీడలకూ..**

జపాన్ వేదికగా ఆసియా క్రీడలు జరుగుతున్నాయి. ఈ పోటీలను వర్షాలు ఇబ్బంది పెడుతున్నాయి. ఇప్పటికే ఈక్వెస్ట్రియన్ ఈవెంట్ కూడా మంగళవారానికి వాయిదా పడింది. ఇండోర్‌లో ఆడేవాటికి సమస్య లేకపోయినా.. ఔట్ డోర్ క్రీడలకు మాత్రం వర్షం అడ్డంకిగా మారుతోంది.




## చెన్నై సూపర్ కింగ్స్‌కు హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్




ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్‌కు (CSK) కొత్త కోచ్ వచ్చాడు. సుదీర్ఘంగా సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో టీమ్‌ఇండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ (Zaheer Khan) ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. పూర్వం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గానూ వ్యవహరించాడు. అంతకుముందు ముంబయి ఇండియన్స్ జట్టుతో కూడా పనిచేశాడు.

**ధోని షరతుకు లోబడే..**

కొత్త ప్రధాన కోచ్ కోసం సీఎస్‌కే అన్వేషిస్తున్నప్పుడు.. ధోని (MS Dhoni) కొన్ని షరతులు పెట్టినట్లు వార్తలు వచ్చాయి. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి భారత్ నుంచే కోచింగ్ బృందం ఉండాలని చెప్పాడట. దీంతో చాలా మంది హేమంగ్ బదానీని సూచించారు. కానీ, అనూహ్యంగా జహీర్ ఖాన్‌ను సీఎస్‌కే ప్రకటించింది.

# ఆ సిరీస్‌లో.. రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించండి: ఇర్ఫాన్ పఠాన్




వన్డే ప్రపంచ కప్ 2027కు సరిగ్గా ఏడాది సమయం ఉంది. ఈలోగా తక్కువ వన్డే సిరీస్‌లను మాత్రమే భారత్ ఆడనుంది. అందుకే, ప్రతి మ్యాచ్‌ను ఓ పరీక్షగానే భావించాలని టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. ఇటువైపు మేనేజ్‌మెంట్ కూడా అలానే తీసుకోవాలన్నాడు. సెప్టెంబర్ 27 నుంచి విండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ ఆడనుంది. ఈ సిరీస్‌లో భారత రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించాలని ఇర్ఫాన్ తెలిపాడు. "విండీస్‌తో వన్డే సిరీస్‌లో నాకు ఒకే ఒక్క ప్లేయర్ ఆటను వీక్షించాలని ఉంది. అదీనూ అతడికి ఎన్ని మ్యాచుల్లో ఆడే అవకాశం వస్తుందో చూడాలి. అతడే యశస్వి జైస్వాల్. ఈ కుర్రాడిని బ్యాకప్ ఓపెనర్‌గా మేనేజ్‌మెంట్ తీసుకుంది. మరి ఇలాంటి ఆటగాడికీ వచ్చే ఏడాది వరల్డ్ కప్ వెళ్లేనాటికి సరైన అవకాశాలు ఇవ్వాల్సిన అవసరమూ ఉంది. ఎప్పుడు అవకాశం ఉన్నా ఆడించేందుకు ప్రయత్నించాలి. అదెలా చేస్తారనేది మేనేజ్‌మెంట్ పర్యవేక్షించాలి. బ్యాటింగ్ ఆర్డర్ మారుస్తారా? ప్లేయర్లను రొటేట్ చేస్తారా? అనేది మీ ఇష్టం. ఇప్పుడీ విండీస్ సిరీస్‌లో ఒక్క అవకాశమైనా ఇస్తే బాగుంటుందనేది నా అభిప్రాయం" అని ఇర్ఫాన్ వెల్లడించాడు.

**వారు లేకపోయినా..**

'ఇప్పుడు వెస్టిండీస్‌తో ఆడే జట్టు పూర్తిస్థాయి ప్రధాన జట్టు కాదు. రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించేందుకు ఇదే సరైన సమయంగా భావిస్తా. బుమ్రా, శ్రేయస్, అక్షర్, సుందర్.. ఇలాంటి ప్లేయర్లు లేరు. వారంతా ఆసియా గేమ్స్ కోసం వెళ్లారు. వచ్చే వరల్డ్ కప్‌నాటికి కొన్ని మ్యాచులు మాత్రమే ఉంటాయి. అందుకే, బెంచ్‌పై ఉన్న ప్లేయర్లను ఆడించాలి. ఒకేసారి ఆసియా గేమ్స్, వెస్టిండీస్ సిరీస్‌లు రావడం వరంలా భావించాలి. కుర్రాళ్లకు ఛాన్స్ ఇవ్వండి" అని ఇర్ఫాన్ సూచించాడు.

# మహిళల ఆంధ్రాప్రిమియర్ లీగ్.. ఒక్క పరుగు తేడాతో గోదావరి విజయం

మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్‌లో ఉత్కంఠభరితంగా సాగిన పోరులో గోదావరి గోల్డెన్ ఈగల్స్ జట్టు ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. అమరావతి ఈ ఛాంపియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గోదావరి తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో అమరావతి 143 పరుగులకు ఆలౌటైంది. దేవిక (63) పోరాటం వృథా అయింది. తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు కూడా తడబాటుకు గురైంది. ఓపెనర్లు ఉద్విత (0), విన్నీ సుజెన్ (11)ను అమరావతి బౌలర్లు త్వరగా పెవిలియన్‌కు చేర్చారు. పిచ్ నుంచి బౌలర్లకు సహకారం లభించడంతో గోదావరి బ్యాటర్లు నెమ్మదింగా ఆడారు. పుష్పిత గౌడ (54), పెరీరా (37) గోదావరి ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఆఖర్లో మహాలక్ష్మి (20*), వడ్డే అక్షయ (16*) బ్యాట్‌ను ఝుళిపించడంతో గోదావరి స్కోరు 140 పరుగులు దాటింది. అమరావతి బౌలర్లు పూజిత 2.. లక్ష్మి, తరిణి చెరో వికెట్ తీశారు.

## అదరగొట్టిన గ్రీష్మ.. రాయలసీమ జెన్ స్టార్స్ విజయం



మంగళగిరి: డబ్ల్యూఏపీఎల్‌లో భాగంగా వైజాగ్ ఫైర్ బర్డ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ జెన్ స్టార్స్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. 175 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన.. వైజాగ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 152 పరుగులకే పరిమితమైంది. పుష్పలత (48), హాసిని చౌదరి (35) రన్స్ చేశారు. రాయలసీమ బౌలర్లలో పద్మజ, అనూష, ధాత్రి తలో 2 వికెట్లు తీశారు. పావని ఒక వికెట్ పడగొట్టింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాయలసీమ.. నిర్ణీత 20 ఓవర్లలో 174/7 పరుగులు చేసింది. గ్రీష్మ సైనీ రెడ్డి 70 (38 బంతుల్లో) పరుగులు చేసి అదరగొట్టింది. పద్మజ (39), పావని (31) రన్స్



# ముగ్గురు హీరోయిన్లతో వెంకటేష్ స్టెప్పులు

హీరో వెంకటేష్ ముగ్గురు హీరోయిన్లతో కలిసి స్టెప్పులు వేయబోతున్నారు. వెంకటేష్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతోన్న మూవీ ఆదర్శకుటుంబం అక్టోబర్ 2న థియేటర్లలోకి రాబోతుంది. ఇందులో వెంకటేష్‌కు జోడీగా శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా కనిపించబోతుంది. నారాయణమ్మ అంటూ సాగే పాటను మంగళవారం రిలీజ్ చేయబోతున్నారు. ఈ మాస్ సాంగ్‌లో వెంకటేష్ హీరోయిన్ శ్రీనిధి శెట్టితో పాటు నివేదా పేతురాజ్, డింపుల్ హయతిలతో స్టెప్పులు వేయనున్నారు.

# లంగా ఓణీలో కృతిశెట్టి

**జనవరి 12 విడుదల ఫస్ట్ లుక్ రిలీజ్**

ఉప్పెన సినిమాతో యువతరం కలలరాణిగా మారిపోయిన కృతిశెట్టి అనూహ్యంగా అనిల్ రావిపూడి మల్టీస్టారర్ మూవీ జనవరి 12 విడుదలలో ఛాన్స్ దక్కించుకొని టాలీవుడ్ వర్గాలను సర్‌ప్రైజ్ చేసింది. ఈ మల్టీస్టారర్‌లో వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా నటిస్తున్నారు. కృతి శెట్టితో పాటు కీర్తి సురేష్ మరో హీరోయిన్‌గా నటిస్తోంది. కృతి శెట్టి బర్త్‌డే సందర్భంగా సోమవారం జనవరి 12 విడుదల మూవీ నుంచి ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో లంగా ఓణీలో ట్రెడిషనల్ లుక్‌లో కనిపిస్తోంది. ఈ సినిమాలో దీపికా రెడ్డి అనే రాయలసీమ యువతిగా మాస్ కోణంలో కృతిశెట్టి పాత్ర డిఫరెంట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. జనవరి 12 విడుదలలో కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతిశెట్టి కనిపించబోతుంది.








సినిమా

# పదకొండేళ్ల తర్వాత కన్నడ సినిమాలో అదాశర్మ

అదా శర్మ దాదాపు పదకొండేళ్ల తర్వాత కన్నడ భాషలో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.పునీత్ రాజ్‌కుమార్ హీరోగా నటించిన రణ విక్రమ సినిమాతో సాండల్‌వుడ్‌లోకి అడుగుపెట్టింది అదా శర్మ. రణవిక్రమ తర్వాత కన్నడంలో చాలానే ఆఫర్లు వచ్చాయి. తెలుగులో బిజీగా ఉండటంతో వాటిని రిజెక్ట్ చేసింది. లాంగ్ గ్యాప్ తర్వాత ఓ మైథాలజీ మూవీతో సాండల్‌వుడ్‌లోకి రీఎంట్రీ ఇవ్వబోతుంది అదా శర్మ. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బీఎమ్ గిరిరాజ్ దర్శకత్వంలో రామరస పేరుతో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ మైథాలజీ థ్రిల్లర్‌లో ప్రధాన నాయికగా అదా శర్మ ఛాన్స్ దక్కించుకుంది. సుడుగాడు తెగల జీవితాల నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో తాంత్రిక విద్యలు తెలిసిన ఓ మంత్రగత్తెగా డీ గ్లామర్ పాత్రలో అదా శర్మ కనిపించబోతున్నట్లు సమాచారం. ఆమె లుక్, క్యారెక్టరైజేషన్ విభిన్నంగా ఉంటాయని అంటున్నారు.

# ప్రెగ్నెన్సీతో అర్ధరాత్రి వరకు షూటింగ్

ప్రెగ్నెన్సీతో ఉండి కూడా అర్ధరాత్రి వరకు షూటింగ్‌లో పాల్గొన్నది సమంత. ఆమె డెడికేషన్, కమిట్‌మెంట్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు గ్యాప్ తీసుకున్న ఆమె తమిళంలో ఓ టీవీ షోకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మాస్టర్ చెఫ్ షోకు హోస్ట్‌గా వ్యవహరించబోతుంది. సోని లివ్ ఓటీటీతో పాటు సోనీవిళా టీవీలో ఇది టెలికాస్ట్ కాబోతుంది. కుకరీ షో షూటింగ్ కోసం ఇటీవలే చెన్నై వెళ్లి, షూటింగ్ మొదలుపెట్టింది. గత వారం ఒకే రోజు ఐదారు ఎపిసోడ్స్ తాలూకు షూటింగ్‌ను మేకర్స్ పూర్తిచేసినట్లు తెలిసింది. ఉదయం నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు నాన్‌స్టాప్‌గా చిత్రీకరణ జరిపినట్లు సమాచారం. షూటింగ్ మొత్తం ఎలాంటి అలసట లేకుండా చాలా హుషారుగా కనిపించిందని అంటున్నారు.






# 25 నుంచి ఓటీటీలోకి టాక్సిక్ ?

ఈ ఏడాది భారీ అంచనాల నడుమ థియేటర్లలోకి వచ్చిన టాక్సిక్ బాక్సాఫీస్ వద్ద దారుణంగా నిరాశపరిచిం ది. దాదాపు ఆరు వందల కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ మూడు వందల కోట్లలోపే వసూళ్లను దక్కిం చుకుంది. టాక్సిక్ సెప్టెంబర్ 25 నుంచి జీ5 ఓటీటీలో ఈ మూవీ స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. కన్నడంతో పాటు తెలుగులోనూ రిలీజ్ అవుతోన్నట్లు సమాచారం. థియేటర్ వెర్షన్‌తో పోలిస్తే ఓటీటీ వెర్షన్‌లో చాలా మార్పులు చేసినట్లు సమాచారం. మూడు గంటల పధ్నాలుగు నిమిషాల సుధీర్ఘ రన్‌టైమ్‌తో థియేటర్లలో టాక్సిక్ రిలీజైంది. ఓటీటీ కోసం దాదాపు 30 నిమిషాలు సినిమాను ట్రిమ్ చేయబోతున్నారు. బోల్డ్ సీన్లతో పాటు కొన్ని యాక్షన్ ఎపిసోడ్స్ కట్ చేయబోతున్నట్లు చెబుతున్నారు. టాక్సిక్ మూవీలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా హీరోయిన్లుగా నటించారు. హ్యూమా ఖురేషి ఓకీలక పాత్రలో నటించింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. డైరెక్టర్‌తో కలిసి యశ్ ఈ సినిమాకు కథను అందించారు.